అజ్ఞాత దళ సభ్యుడి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 27: ఇల్లెందు పోలీసులు ఓ అజ్ఞాత దళ సభ్యుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీఐ కరుణాకర్ వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని రొంపేడు వద్ద ఈ 26న పోలీసులు వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఈక్రమంలో ఇదే ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా మండల పరిధిలోని మాణిక్యారం గ్రామానికి చెందిన అజ్ఞాత దళ సభ్యుడు నాయిని కొమురయ్య అలియాస్ కొండన్నగా గుర్తించారు. ఈ నెల 16వ తేదీన పూసపల్లి అటవీప్రాంతంలో సాయుధ దళాలు నిర్వహించిన సమావేశంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌తో పాటు మరో నలుగురిని అరెస్టు చేశామని, ఆరోజు కొంతమంది పరారు కాగా వారిలో ఒకరైన కొమురయ్య పట్టుబడినట్లు సీఐ తెలిపారు. కొమురయ్య నుంచి 5 జిలిటిన్ స్టిక్స్, 5 డిటోనేటర్లు లభ్యమయ్యాయని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సైలు, రైటర్ పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

నలుగురు మావోయిస్టుల మృతి.. బీజాపూర్ జిల్లాలో ఘటన

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 27: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పులు జరిగాయి. ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. తెలిసిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. బీజాపూర్ జిల్లాలోని చోటే తుంగలి అటవీప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందని సమాచారం అందుకున్న డీఆర్జీ, సీఆర్పీఎఫ్ భద్రతా దళాలు ఆ ప్రాంతంలో మంగళవారం సెర్చింగ్ ఆపరేషన్ చేస్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య సుమారు 40 నిమిషాల పాటు భీకరపోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూ దట్టమైన అటవీప్రాంతంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఘటనా స్థలంలో నలుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉన్నది.

పోక్సో కేసులో వ్యక్తికి జైలు శిక్ష

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 27: పోక్సో కేసులో వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ ఎం.శ్యాంశ్రీ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మణుగూరు సర్వెంట్ క్వార్టర్స్‌కు చెందిన ఓ బాలికతో మోత్కూరి వెంకటేశ్వర్లు 2021 ఫిబ్రవరి 15న అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై 2021 ఫిబ్రవరి 24న సదరు మణుగూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై భానుప్రకాశ్ కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. తొమ్మిదిమంది సాక్షుల విచారణ అనంతరం వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కావడంతో జడ్జి అతడికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రావి విజయకుమార్ వాదనలు వినిపించారు.

ప్లాట్ల కేటాయింపునకు చర్యలు

పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్‌స్వామి

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 27: లబ్ధిదారులకు కేటాయించేందుకు వారం రోజుల్లోగా స్థలాలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధికారులకు సూచించారు. ఒక్కొక్కరికీ 75 గజాల చొప్పున పట్టణంలోని అర్హులైన పేదలకు కేటాయించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించడం, అందుకు అనుగుణంగా డ్రా ద్వారా 807 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం, వారికి ఆ స్థలాల పట్టాలు కూడా పంపిణీ చేయడం వంటివి జరిగాయి. కానీ లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు జరగలేదు. దీంతో ఇప్పుడు వారికి ప్లాట్ల కేటాయింపు కోసం కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పాత కొత్తగూడెంలోని లబ్ధిదారులకు కేటాయించిన స్థలాన్ని, అక్కడి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ప్లాట్ నెంబర్లు కేటాయించాలని, వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్లు కేశంశెట్టి సుజాత, వేముల ప్రసాద్, బీఆర్ఎస్ నాయకుడు దుర్గ, విజయ్, టీపీఎస్ ప్రభాకర్, డీఈ రవికుమార్, ఏఈ రాము పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్ Classifieds
HOUSE FOR SALE
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319447-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాటుసారా విక్రేతలపై కేసు

కరకగూడెం, ఫిబ్రవరి 27: మండలంలోని సమత్ భట్లుపల్లి పంచాయతీ బూడిదవాగు వద్ద నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం కరకగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ఇద్దరు వ్యక్తులు నాటుసారా తలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేయగా బూడిదవాగు వద్ద వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 8 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సేవాలాల్ మహారాజ్ జీవితం స్ఫూర్తిదాయకం

సేవాలాల్ చిత్రపటానికి నమస్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

ఇల్లెందు, ఫిబ్రవరి 27 : బంజారాల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ప్రియాంక అల అన్నారు. మంగళవారం సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ముగింపు ఉత్సవాలను ఇల్లెందులోని జేకే కాలనీ సింగరేణి గ్రౌండ్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి భోగ్ బండారో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. ప్రకృతి వన్యప్రాణులను రక్షించడం ద్వారా మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని తెలియజేశారన్నారు. ఎమ్మెల్యే కోరం మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘ సంస్కర్త, ఆధ్యాత్మికవేత్త, ప్రకృతి ప్రేమికుడు, సంప్రదాయాల పరిరక్షకుడిని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిత్, కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్, బెల్లయ్యనాయక్, సంత్ సేవాలాల్ మహారాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథక పనుల్లో అవకతవకలు

36 మందికి షోకాజ్ నోటీసులు

ప్రజావేదికకు హాజరైన అధికారులు

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 27: ఈ నెల 12వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మండలంలోని ఆయా పంచాయతీల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలో నిర్వహించిన నివేదికలను మంగళవారం బూర్గంపహాడ్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జమలారెడ్డి అధ్యక్షతన చేపట్టిన ప్రజావేదికలో చదివి వినిపించారు. పని జరిగిన ప్రదేశంలో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై ఆడిట్ అధికారులు మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై ఏపీడీ రవి అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నించారు. భవిష్యత్‌లో అలా జరగకుండా చూసుకుంటామని ఏపీవో విజయలక్ష్మి సమాధానం ఇచ్చారు. సామాజిక తనిఖీ ప్రజావేదికకు ఉపాధిహామీ కూలీలు హాజరుకాలేదు. టేకులచెరువు, లక్ష్మీపురం గ్రామ నివేదికను బీఆర్పీ శ్రావణ్, నకిరిపేట, వేపలగడ్డ నివేదికలను బీఆర్పీ ప్రవీణ్, ఇరవెండి, తాళ్లగొమ్మూరు, కోయగూడెం నివేదికలను బీఆర్పీ నవీన్, మోతే, నాగినేని ప్రోలు, బూర్గంపహాడ్ నివేదికలను బీఆర్‌పీ అపర్ణ, పినపాక పట్టినగర్, ఉప్పసాక, మోరంపల్లి బంజర నివేదికను బీఆర్పీ హరీశ్, కృష్ణసాగర్, అంజనాపురం నివేదికను బీఆర్పీ రాకేశ్ చదివి వినిపించారు. ఇరవెండి గ్రామ పంచాయతీ పరిధిలో 23 పనులకు రూ. కోటి 49 లక్షలు, తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలో రూ.80వేల పనులు చేయించినట్లు చెప్పారు. ఆడిట్‌కు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలను ఎస్ఆర్పీ సుశీల, ఏపీడీకి అందజేశారు. ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై 36 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు ప్రజావేదికలో ఏపీడీ వెల్లడించారు. రూ.76 వేలు రికవరీ చేయించినట్లు తెలిపారు.

మారాయిగూడెంలో మినీ మేడారం

రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మారాయిగూడెం గ్రామంలో మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు మండమేలు గుట్ట వద్ద జాతరను ప్రారంభించారు. అనంతరం జంపన్న వాగు వద్ద దేవరబాలలు గంగాస్నానం, వాగు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గద్దెలను శుద్ధి చేశారు. ఈ జాతర ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. దేవర బాలలుగా సోడె శాంతమ్మ, మచ్చమ్మ, నాగులమ్మ వ్యవహరించారు. జాతరకు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

– దుమ్ముగూడెం, ఫిబ్రవరి 27

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయశాఖాధికారి బాబూరావు

పైరును పరిశీలిస్తున్న డీఏవో బాబూరావు

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 27: ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖాధికారి బాబూరావు హెచ్చరించారు. మంగళవారం అన్నపురెడ్డిపల్లి, నామవరం, పెద్దిరెడ్డిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించి, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించారు. పంటలను సందర్శించి, రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సేవ చేసే వారికి ప్రభుత్వ సహకారం

మాట్లాడుతున్న మల్లు నందిని

భద్రాచలం, ఫిబ్రవరి 27: స్వచ్ఛందంగా ప్రజాసేవ చేసే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు సహకరిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లు నందిని అన్నారు. మంగళవారం స్థానిక శ్రీనిధి రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన గ్లోబల్ హ్యూమానిటేరియన్ మిషన్ వ్యవస్థాపకుడు సద్గురు మధుసూదన్ సాయి స్పిరిచ్యువల్ స్పీచ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బడికి వెళ్తున్న విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సద్గురు మధుసూదన్ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నారని, దానికి 50శాతం నిధులు ట్రస్ట్ సమకూరుస్తుండగా మిగిలిన 50శాతాన్ని తెలంగాణ ప్రభుత్వం భరించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. తొలుత వారు భద్రాద్రి రామయ్య ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఎంపీ టికెట్ కోసం చందా లింగయ్య దరఖాస్తు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 27: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నానని మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ చైర్మన్ చందా లింగయ్యదొర అన్నారు. మంగళవారం ఆయన మణుగూరులో విలేకరులతో మాట్లాడారు. 40ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ప్రజాసేవ చేస్తూ ప్రజల్లో ఉంటూ వస్తున్నానన్నారు. ఎంపీ టికెట్ వస్తే తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు సన్మానం

పాల్వంచ, ఫిబ్రవరి 27: కేటీపీఎస్ 5, 6 దశల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్కార్ట్ ఆఫీసర్ శ్యాంకుమార్ కుమార్తె దీప్సిక, ప్రసాదరావు కుమార్తె దీపాహస్మితలు ఇటీవల విజయవాడలో జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపర్చారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థినులను కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు మంగళవారం సన్మానించి అభినందించారు. ఎస్ఈ వెంకటేశ్వర్లు, రామారావు, వెల్ఫేర్ ఆఫీసర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

బాల్యవివాహాల అడ్డగింత

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 27: రెండు బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్న ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకున్నది. సీడీపీవో రోజారాణి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒక గ్రామంలో ఇద్దరు మైనర్‌లకు బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం మేరకు ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. వీరిలో ఒక మైనర్ బాలిక (16)కు బుధవారం రాత్రి వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా అడ్డుకున్నారు. మరొక మైనర్ బాలిక(16)కు ఈనెల 24వ తేదీన ఏపీలోని అన్నవరం దేవస్థానంలో వివాహం జరిగి, మంగళవారం స్వగ్రామంలో ఇంటి వద్ద రిసెప్షన్ జరుగుతుండగా సమాచారం మేరకు నిలిపివేశారు. ఇద్దరు బాలికలను అశ్వారావుపేట ఐసీడీఎస్ సీడీపీవో రోజారాణి పోలీసుల సహకారంతో కొత్తగూడెంలోని చిల్డ్రన్స్‌హోమ్‌కు తరలించారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

టేకులపల్లి, ఫిబ్రవరి 27: తొమ్మిదోమైలుతండా పంచాయతీ కోటల్ల గ్రామానికి చెందిన ఈసం భద్రమ్మ(55) మతిస్థిమితం సరిగా లేక చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి తిరిగి వస్తుండేది. సోమవారం ఇంటినుంచి వెళ్లిన భద్రమ్మ తిరిగిరాలేదు. మంగళవారం రోళ్లపాడు సమీపంలో చెట్టుకింద ఆమె విగత జీవిగా కనిపించింది. స్థానికులు మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి భర్త నీలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడవులను రక్షించుకుందాం

ములకలపల్లి, ఫిబ్రవరి 27: అడవులను నరకవద్దని, అడవులను రక్షించి భావితరాలకు అందిందామని ములకలపల్లి అటవీశాఖ రేంజర్ రవికిరణ్ అన్నారు. మంగళవారం గుండాలపాడు అటవీప్రాంతంలో ఆయన పర్యటించారు. పోడుసాగులో ఉన్న భూములను పరిశీలించి, వలస ఆదివాసీలకు అవగాహన కల్పించారు. ఎఫ్ఎస్‌వో, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 27: ఏ ఉద్యోగికైనా ఉద్యోగోన్నతి కర్తవ్య నిర్వహణ బాధ్యతను మరింత పెంచుతుందని ఏరియా ఎస్పోటూ జీఎం వీసం కృష్ణయ్య అన్నారు. మంగళవారం మణుగూరు పీకేఓసీ–2 బేస్ వర్క్‌షాప్‌లో కొత్తగూడెం రీజియన్‌లో అర్హతగల ఏ–గ్రేడు ఈపీ ఆపరేటర్లకు ఉద్యోగోన్నతి భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

ముగ్గురి ఆత్మహత్య

మణుగూరుటౌన్, ఫిబ్రవరి27: మండల కేంద్రంలోని మణుగూరు పీకే–1 సెంటర్ ఏరియాకు చెందిన ధనుగూరి స్వాతి (23) పిల్లలు కలగడం లేదనే మనోవేదనతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వాతికి వివాహమై నాలుగు సంవత్సరాలైనా పిల్లలు పుట్టడం లేదని మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జెట్టివారి గూడెంలో ..

అశ్వారావుపేట, ఫిబ్రవరి 27: మండలంలోని జెట్టివారిగూడేనికి చెందిన అర్జున్ (33)కు కొంతకాలంగా భార్య సునీతతో మనస్పర్థలు ఉన్నాయి. మంగళవారం సాయంత్రం వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం అర్జున్ ఇంట్లోకి వెళ్లి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అర్జున్ మృతి చెందినట్లు నిర్ధారించారు. అతడి మృతిపై ఎస్సై శ్రీరాముల శ్రీను దర్యాప్తు చేపట్టారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట, ఫిబ్రవరి 27: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకున్నది. పట్టణంలోని నందమూరి నగర్‌కు చెందిన ఆరేపల్లి పద్మ (32) భర్త లేని సమయంలో ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగానే ఆమె మృతి చెందింది. మృతికి కారణాలు తెలియరాలేదు. ఎస్సై శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వారావుపేట తహసీల్దార్‌గా శ్రీనివాస్

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 27: అశ్వారావుపేట తహసీల్దార్‌గా ఎం.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. చర్ల తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్‌ను డీటీ సుచిత్ర, ఆర్ఐ కృష్ణ, సిబ్బంది కలిసి అభినందించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కృష్ణప్రసాద్ బూర్గంపహాడ్‌కు బదిలీపై వెళ్లారు.

సంక్షిప్తం

సుజాతనగర్ ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం

సుజాతనగర్, ఫిబ్రవరి 27: సుజాతనగర్ ఎంపీపీ భూక్యా విజయలక్ష్మిపై ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీ విజయలక్ష్మిపై ఇటీవల ఐదుగురు ఎంపీటీసీలు కొత్తగూడెం ఆర్డీవోకు అవిశ్వాసం తీర్మానం నోటీసు అందించారు. ఈ క్రమంలో డీఆర్‌వో రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీటీసీలు కసనబోయిన భద్రం, బానోత్ అనీత, సీపీఐ ఎంపీటీసీలు బత్తుల మానస, మూడ్ గణేశ్ కలిపి మొత్తం ఆరుగురు ఎంపీటీసీలు సమావేశానికి హాజరయ్యారు. అధికారులు ఓటింగ్ నిర్వహించగా హాజరైన ఆరుగురు ఎంపీటీసీలూ అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గినట్లు డీఆర్‌వో ప్రకటించారు. అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ ద్వారా పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపుతామని, తదుపరి ఉత్తర్వులు వచ్చాక ఎంపీపీ ఎన్నికను నిర్వహిస్తామని డీఆర్‌వో తెలిపారు.

ఇల్లెందు కౌన్సిలర్ కిడ్నాప్‌పై డీజీపీకి ఫిర్యాదు

ఇల్లెందు, ఫిబ్రవరి 27 : ఇల్లెందు మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన అవిశ్వాస తీర్మానం సందర్భంగా కౌన్సిలర్ల కిడ్నాప్‌నకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత మంగళవారం డీజీపీ రవిగుప్తకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులపై అధికార పార్టీ నాయకులు చేసిన దాడులపై కూడా సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

టీఎన్‌జీవో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 27: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీవో) భద్రాద్రి జిల్లాకు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. దీనికి ఎన్నికల అధికారిగా జీ.వీరబాబు వ్యవహరించి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడిగా అమరనేని రామారావు, కార్యదర్శిగా కంచర్ల సాయిభార్గవ చైతన్య, అసోసియేట్ అధ్యక్షుడిగా రామనర్సయ్య, కోశాధికారిగా సోమయ్య, ఉపాధ్యక్షులుగా గడ్డం ఉష, ఊట్కూరి నాగేశ్వరరావు, గొల్లమందల రమేశ్, జాయింట్ సెక్రటరీలుగా నవీన్, మాటేటి ఉషారాణి, కార్యవర్గ సభ్యులుగా అరుణ, మధుసూధన్‌రెడ్డి ఎన్నికయ్యారు.

కేవోసీ లారీడ్రైవర్ల వేతనాలు పెంచాలి

టేకులపల్లి, ఫిబ్రవరి 27 : కేవోసీ లారీ, టిప్పర్ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలను పెంచాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మంగళవారం కేవోసీలో లాకావత్ నరేశ్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న మాట్లాడుతూ లారీ అధ్యక్ష, కార్యదర్శులకు డిమాండ్ నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతర పోస్టర్ల ఆవిష్కరణ

టేకులపల్లి, ఫిబ్రవరి 27 : కోయగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో జరిగే లింగ బసవేశ్వరస్వామి జాతర పోస్టర్లను మాజీ సర్పంచులు కోరం సురేందర్, కోరం ఉమ మంగళవారం ఆవిష్కరించారు. మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు జాతర జరుగుతుందని తెలిపారు. ఆలయ పూజరి, బానోత్ శ్రీను పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యంపై అవగాహన

సారపాక, ఫిబ్రవరి 27: స్థానిక ఐటీసీ అనుబంధ సంస్థ అయిన రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్‌భద్ర సారపాక ఆధ్వర్యంలో గాంధీనగర్ శ్రీసత్యసాయి స్కూల్‌లో పర్యావరణ కాలుష్యంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత పాఠశాలలో మొక్కలు నాటారు. క్లబ్ ప్రెసిడెంట్ ఆర్‌టీఎన్ జయంత్‌కుమార్ పర్యావరణ కాలుష్యం, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించారు.

జీతాలు చెల్లించాలని ధర్నా

టేకులపల్లి, ఫిబ్రవరి 27 : హాస్టల్‌లో ఔట్‌సోర్సింగ్‌లో వంట చేస్తున్న సిబ్బందికి 18 నెలలుగా జీతం రాకపోవడంతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గోలియాతండ పంచాయతీ పీఎంహెచ్, బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్‌లో కాంట్రాక్టు వర్కర్స్‌గా పనిచేస్తున్న మెస్, వాచ్‌మెన్స్ ధర్నాలో పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు పరీక్ష కిట్స్

భద్రాచలం, ఫిబ్రవరి 29: ఐటీసీ భద్రాచలం మహిళా సమితి (బీఎంఎస్) ఆధ్వర్యంలో పట్టణంలోని గిరిజన గురుకులాల్లో ఇంటర్, పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు ప్యాడ్, పెన్స్, స్కెచ్ పెన్స్, రబ్బర్, స్కేల్, పౌచ్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సునీత మెహంతి, రేష్మ శర్మ, ప్రతిభ మనోజ్, దేవదాస్ పాల్గొన్నారు.

'విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి'

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27: ప్రాథమిక విద్యా స్థాయిలోనే విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పెంచాలని నోడల్ అధికారి డాక్టర్ ప్రభుదయాశ్ సూచించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరం ప్రభు